


దేశానికే ఆదర్శంగా కాంగ్రెస్ సంక్షేమ పథకాలు


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం | 09 డిసెంబరు, 2024 | పేజీలు : 05


## యధావిధిగా కొనసాగుతున్న

# అక్రమ ఇసుక రవాణా



### వచ్చిన కొత్తలో ఇసుకను కట్టడి చేసిన పోలీసులు

### కొద్దిరోజులు కాకమునుపే చూసీ చూడనట్లు వైఖరి

### అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు

**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట మండల పరిధిలో ఇసుక రవాణా అనుమతులు లేకుండా కొనసాగించడం చట్టరీత్యా నేరమని కొద్ది రోజులపాటు వర్ధన్నపేట పోలీసులు వాటిని అడ్డుకున్నారు. ఇంతలో ఏం జరిగిందో ఎవరికి అర్థంకాని పరిస్థితి చోటుచేసుకుంది. సరిగ్గా 15 రోజులు పూర్తి కాకమునుపే మళ్లీ యధావిధిగా కొనసాగుతున్నాయంటే పోలీసు అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే సాధ్యమవుతుందన్న విషయం ప్రచారం అవుతుంది. వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ కి రెగ్యులర్ బదిలీలలో భాగంగా వచ్చిన పోలీసు అధికారులు చట్ట వ్యతిరేక పనులు చేస్తే సహించేది లేదని దిక్కరించి, మొండి పట్టు పట్టారు. ఇంతలో ఏదో జరగరాని సంఘర్షణ జరగడం వల్లే వారు వెనుకడుగు వేశారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన కొత్తలో ఎందుకు అంత పట్టు బిగించే అవకాశం తీసుకోవాలి..? కొద్దిరోజులు గడవకముందే ఎప్పటిలాగే మళ్లీ ఎందుకు ప్రోత్సహించాలన్న సందేహం ప్రజల్లో ప్రశ్నార్థకమైంది. తవ్వకాలను నిర్వహణ, ఇసుక రవాణా కారణంగా జరుగుతున్న నష్టాలపై స్థానిక అధికారులకు ఏమైనా అవగాహన ఉందా..? తవ్వకాల నిర్వహణ చేయడం వల్ల భూభాగంలో నీటి శాతం తగ్గిపోతుంది, వ్యవసాయానికి ఉపయోగపడే సారవంతమైన భూములు ధ్వంసం అవుతున్నాయి. నిరంతరం అలుపెరుగని రీతిలో ఇసుక ట్రాక్టర్లు గ్రామాల్లో నుంచి రవాణా చేయడం వల్ల అంతర్గత రోడ్లు మొత్తం నిరుపయోగంగా తయారవుతున్నాయి. అక్కడక్కడ ఆకస్మిక ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. గతంలో వర్ధన్నపేట ప్రాంతం నుంచి వరంగల్ వైపు రవాణా కొనసాగిస్తున్న క్రమంలో తెల్లవారుజామున ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఒక్కసారిగా వందలాది ట్రాక్టర్లు క్యూ పద్ధతిలో వరుసుగా వెళుతూ ఒకదాన్ని మరొకటి దాటేందుకు ప్రయత్నం చేయడం వల్ల పలుమార్లు ప్రమాదాలు సంభవించిన సందర్భాలు పోలీసు రికార్డులలో ఉన్నాయి. అలాంటప్పుడు ప్రభుత్వ నిషేధిత ఇసుక రవాణా కళ్ళముందే కొనసాగుతుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల అంతరార్థం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నూతనంగా వచ్చిన పోలీసు అధికారులు వర్ధన్నపేట నుంచి వరంగల్ హైవేపై ఉన్న వర్ధన్నపేట, ఐనవోలు, మామునూర్, మిల్స్ కాలనీ స్టేషన్ లలో విధులు నిర్వర్తించేవారు కొత్తగా వచ్చిన సమయంలో వారి నిజాయితీని ప్రదర్శించే విధంగా ప్రయత్నిస్తూ ఉంటారు. తిరిగి ఏదో విధంగా ఎప్పటిలాగే రవాణకు అవకాశం ఇస్తూ కాలయాపన చేస్తుంటారు. ఎవరైనా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తే, ప్రస్తుతం స్టేషన్లో భూముల పంచాయతీలు, అన్నదమ్ముల తగాదాలు, భార్యా, భర్తల పంచాయతీలు, దొంగతనం కేసులు, అత్యాచారాలు, హత్యాయత్నాలు వంటి కేసులే తేలడం లేదని బదులిస్తూ దాట వేస్తుంటారు. ఈ పనితీరు ఎవరికీ అర్థం కాని పరిస్థితి చోటుచేసుకుంది. వచ్చిన కొత్తలో పూర్తి పవర్ ఉపయోగించిన అధికారులు హఠాత్తుగా శాంతిపరులు కావడం పట్ల ఇసుక రవాణాకు చెందిన వారితో చేతులు కలిపి ముడుపులు తీసుకున్న కారణంగానే శాంతిపరులుగా వ్యవహరిస్తున్నట్లు అధికారుల పనితీరు పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహణ వల్ల జరుగుతున్న నష్టాలను భర్తీ చేస్తూ, అనుమతులు లేని తవ్వకాల నిర్వహణకు తెరవేయాలని తవ్వకాల నిర్వాహణ సమీపంలోని రైతులు కోరుతున్నారు.

# ఆధునిక యుగంలో ఆధ్యాత్మికత అవసరం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

### బ్రహ్మకుమారి భవన నిర్మాణానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతి-నిధి :** ఆధునిక యుగం, ఉరుకులు పరుగుల జీవితంలో ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ నూతన భవన నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రస్తుత ఆధునిక మానవ జీవితంలో ఆధ్మాత్మికత, శాంతి తప్పనిసరి అని అన్నారు. అందుకు సమాజాన్ని శాంతి మార్గంలో నడిపించేందుకు బ్రహ్మకుమారీస్ చేస్తున్న పనులు గర్వకారణం అని అన్నారు. మౌంట్ అబూ (రాజస్థాన్ రాష్ట్రం) తరువాత మన హైదరాబాద్ లో బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ ఉండటం గొప్ప విషయం అన్నారు. బ్రహ్మకుమారీస్ భవన నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం అంబేద్కర్ మైదానంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పిప్పాల రాజేందర్, బుర్ర కొమరయ్య, అప్పం కిషన్, సాంబమూర్తి, బీర్తి పృధ్విరాజ్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, చల్ల రేణుక, శిరూప అనిల్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప సరసన కోటగుళ్ళకు

# ప్రత్యేక స్థానం




## సమష్టి కృషి ఫలితమే

# నేటి ప్రజా ప్రభుత్వ ఏర్పాటు



**ప్రజాపక్షం/కాజీపేట :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి అధ్యక్షతన మడికొండ సత్యసాయి కన్వెన్షన్ హాల్ లో ఆదివారం ప్రజా పాలన విజయోత్సవ సభ నిర్వహించారు.ఈ సభలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి,రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుసుర్ పాషా, జనగామ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపి,మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ జిల్లాకు రానన్ని నిధులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు ముఖ్యమంత్రి మంజూరు చేశారని అన్నారు. జిల్లాలోని అందరి సమిష్టి కృషి వల్లే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది అంటే అది కేవలం కార్యకర్తల కృషితో సాధ్యం అయ్యిందని అన్నారు. విజయవంతంగా ఏడాది కాలం పూర్తి ఈ సందర్భాల్లో ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజవర్గాల్లో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు ఘనంగా నిర్వహించుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అభివృద్ధి కొనసాగుతుందని, ఇక పార్టీ కార్యకర్తల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నాయిని, రేవూరి మాట్లాడుతూ కడియం శ్రీహరి చాలా సీనియర్ నాయకుడని, సిఎంకు ఎవరికీ పదవులు ఇవ్వాలో తెలుసునని, పదేళ్లు ఓపిక పట్టారని, ఇంకా కొన్ని రోజులు సంయమనం పట్టాలని, అందరికీ న్యాయం జరగుతుందని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ ప్రతిష్ట దెబ్బ తీసే చర్యలు చేపట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్పస్వామి పల్లివేట..


పల్లివేట,మహా అన్నప్రసాద దాతగా డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి

మహిళల కోలాటాలు,డప్పు చప్పుళ్ళతో అయ్యప్పస్వామి ఊరేగింపు.



ప్రజాపక్షం / నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 24 వ మండల పూజల మహోత్సవాలలో భాగంగా అయ్యప్ప స్వామికి పల్లివేట కార్యక్రమం శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి సేవా చారిటబుల్ ట్రస్టు కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు సైపా సురేష్ అధ్యక్షతన ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి పల్లివేట మహోత్సవం, మహా అన్నప్రసాద దాతగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి దాతగా ఉన్నారు. వేదపండితులు, కేరళ సాంప్రదాయ తాంత్రిక వేత్త,బ్రహ్మశ్రీ శ్రీమాన్ డాక్టర్ చంద్రమౌళి వెంకటేష్ శర్మ గురుస్వామి నేతృత్వంలో దేవాలయంలో గణపతి హోమంతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలను, అయ్యప్పస్వామి ఊరేగింపు, పల్లివేట వైభవంగా నిర్వహించారు. ముందుగా దాత డాక్టర్ గోగుల లక్ష్మి భార్గవి రాణా ప్రతాప్ రెడ్డి దంపతులు తన తండ్రి గోగుల ప్రతాప్ రెడ్డి , సోదరి భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి రాజీరుద్రమా దేవి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, వరంగల్ జిడబ్ల్యుఎంసి కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్,కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని రాణా తలపైన ఎత్తుకొని పల్లివేట ఊరేగింపు ప్రారంభించారు. నర్సంపేట పట్టణంలోని ప్రధాన రహదారులపై ఊరేగింపుగా అయ్యప్ప మాలధారుల నృత్యాలు, మహిళల కోలాటాలు, డప్పుచప్పులతో మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ గుంటి రజనీ కిషన్ అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగావనం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి అయ్యప్ప స్వామికి సర్వ సైన్యాధ్యక్షుడుగా వ్యవహరించి స్వామివారిని వేటకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి ధాత రాణా ప్రతాప్ రెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఓంకార నామ జెండాలతో నర్సంపేట పట్టణాన్ని ఆకట్టుకున్నది. పల్లివేట అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ పూజారులు స్వామివారిని నిద్రపుచ్చారు. డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో హైందవధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. ఈ అవకాశం కల్పించిన ఆలయ కమిటీ ట్రస్టుకు రాణా ప్రతాప్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా, ఉపాధ్యక్షులు ఇరుకు కోటేశ్వరరావు, పబ్బా రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీరాముల శంకరయ్య, చకిలం కృష్ణమూర్తి, తక్కలపల్లి యుగంధర్ రావు, బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలు బొద్దుల దివాకర్, వజినపెల్లి శ్రీనివాస్, సహాయ కోశాధికారి అనంతుల రామనారాయణ, ముఖ్య సలహాదారులు నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల భాజపా అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తుత్తి ప్రచారం



ప్రజాపక్షం/నెక్కొండ: బాధ్యతగల అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారా నడానికి నిదర్శనం వరంగల్ జిల్లా నెక్కొండ మండల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కార్యాలయానికి ఉద్యానవన శాఖ వారు ఆయిల్ ఫామ్ పెంచితే రైతులకు కలిగే లాభాలు, ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది. ఎంత డబ్బు సంపాదించవచ్చు, అని పోస్టర్ ను మార్కెట్ కార్యాలయంలో అతికించారు. ఆసక్తి గల రైతులు ఈ కింది నెంబర్ ను సంప్రదించాలని, ఈ అధికారులను కలవాలని సూచించారు. కానీ ఆ పోస్టర్లో అధికారి ఫోన్ నెంబర్ లేదు, అధికారి పేరు లేదు, పేరుకే పెద్ద ఎత్తున ప్రచారం ఆచరణ లో మాత్రం శూన్యం లా ఉంది ఉద్యాన వన శాఖ అధికారుల తీరు. ఉద్యానవన శాఖ అధికారులు అతికించిన పోస్టర్లను చూసి రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఎవరిని సంప్రదించాలి ఆసక్తి గల రైతులు అని చర్చించుకుంటున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




25 సంవత్సరాల తరువాత కలిసిన స్నేహితులు

ప్రజాపక్షం/రాయపర్తి : మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆదివారం 1998–99 పదవ తరగతి విద్యార్థుల అపూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన సుమారు 60 మంది విద్యార్థులు పాఠశాలకు చేరుకుని తాము ఆనాడు చదువుకున్న తరగతి గదులు, క్రీడా మైదానము, బ్లాక్ బోర్డులు, పాఠశాల ఆవరణను చూసి భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో తాము విద్యాభ్యాసం చేసిన విధానాలు, చేసిన అల్లరి, కొంటె పనులను గుర్తుకు తెచ్చుకొని పాత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు బిల్లా విజయలక్ష్మి, ఎన్నం రాంనర్సయ్య, రఘునందన్ రెడ్డి, కొయ్యడ వాసంతి, పాకాల చంద్రశేఖర రావు, కొల్లూరి డానియల్ లను పూలమాలలు, శాలువాలు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అప్సర్ పాషా, మచ్చ రమేష్, గారె సంపత్, శ్రీనివాస్, ఖలీల్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా చేయూత



ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని గుడెప్పాడ్ గ్రామానికి చెందిన ఎండీ సలీం తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న సలీమ్ తో పాటు ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 201213 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఆత్మకూరు యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తనుగుల సందీప్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. సలీమ్ తండ్రి అకాల మరణం చెందడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేస్తూ, 16 వేల నగదు ఆర్థిక సహాయాన్ని సలీమ్ కుటుంబానికి అందించి మనో ధర్యం కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించిన ఎంపి కావ్య



ప్రజాపక్షం/కమలాపూర్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా హన్మకొండలో జరిగిన విజయోత్సవ సంబరాల కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సన్మానించారు. అనంతరం అభినందించారు.

# పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజకుమార్



ప్రజాపక్షం /నర్సంపేట : పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదగాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ అన్నారు. నర్సంపేట పట్టణం సర్వాపురం లో నిర్మించిన నూతన పద్మశాలి భవన్ ను ఆయన ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని వరంగల్ రోడ్ నుండి సర్వాపురం వరకు పద్మశాలీలు వారి ద్విచక్ర వాహనాలతో ర్యాలీని నిర్వహించారు. అనంతరం సర్వాపురంలో ఏర్పాటు చేసిన సమావేశం కూచన రవీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని, తెలంగాణ రాష్ట్రంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పద్మశాలీలు వార్డు మెంబర్లుగా, సర్పంచులుగా, కౌన్సిలర్ గా, చైర్మన్ గా నిలబడి గెలవాలన్నారు. రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాజకీయాలపై ఆసక్తి గల వారు శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా కుల సంఘాలు ఎన్నికలు నిర్వహించుకొని రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ సర్వేలో పద్మశాలీలు రెండో స్థానం కలిగి ఉండాలని, రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్న మనము ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా సర్పంచులుగా వివిధ పదవుల్లో పద్మశాలీలకు అధిక పదవులు వచ్చే విధంగా పద్మశాలీలు తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సర్వాపురం గ్రామంలో పద్మశాలి భవన్ నిర్మించుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు వీరమోహన్, పెండెం రామానంద్, బాల్నే సర్వేశం, రుద్ర ఓంప్రకాష్ ,కూచన శ్రీనివాసరావు ,పెండెం శివానంద్, కోడాటి వీరస్వామి, గడ్డం రాజేందర్, కూచన క్రాంతి కుమార్, కుసుమ భద్రయ్య, గోకారామస్వామి, సామల ఎల్లేశం, సిరిమల్లె నరేందర్, కూచన రాజు తదితరులు పాల్గొన్నారు.

# గొల్ల కురుమలకు రెండు లక్షల నగదు బదిలీ హామీని తక్షణమే అమలు చేయాలి

జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్




ప్రజాపక్షం/రాయపర్తి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో గొల్ల కురుమలకు రెండు లక్షల రూపాయలు నగదు బదిలీ హామీని తక్షణమే అమలు చేయాలని మాండ్ చేస్తూ డిసెంబర్ 12న ఇందిరా పార్క్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ గొల్ల పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్ స్టాండ్ సెంటర్ ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరికి మధుకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గొల్లకురుమల అకౌంట్లోకి రెండు లక్షల రూపాయలు నగదు బదిలీ చేస్తామని, హామీ ఇచ్చి మొఖం చాటేసిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సం దర్భంలో గొల్ల కురుమల ఓట్లను ఉపయోగించుకోవడం కోసమేనా మీ హామీ అని మండిపడ్డారు. రాష్ట్రంలో, జిల్లాలో గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేస్తదనే ఆశతో డిడిలు కట్టి ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీడీలు కట్టిన వారికి గొర్రెల పంపిణీ లో భాగంగా లబ్ధిదారుల అకౌంట్లోకి నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే డీడీలను వాపస్ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వందని అసాహనం వ్యక్తిత్వం చేశారు. ప్రతి గ్రామంలో వెటర్నరీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న వెటర్నరీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి సొసైటీకి మూగజీవాల మేత కోసం 10 ఎకరాల భూమిని కేటాయించాలని అన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన గొల్లకురుమలకు 10 లక్షల ఎక్స్రేషియా ఇవ్వాలని అన్నారు. గొల్ల కురుమల డిమాండ్ల సాధన కోసం ఇందిరా పార్కు ముందు జరిగే ధర్నాకు గొల్ల కురుమలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం మండల అధ్యక్షుడు చందు మల్లేష్, ప్రధాన కార్యదర్శి గాజు యాకయ్య, కసరబోయిన రాజు, చిన్నాల ఉప్పలయ్య, పనికిరాని మల్లయ్య, బండి లింగన్న, చందు మహేందర్, కుంట రాంబాబు, నాగుల సాయిలు, మాచాలా పర్శరాములు, కసరాబోయిన కారణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/కమలాపూర్ : హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని తీగల బావి శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శనిగరపు జనార్ధన్, ప్రధాన కార్యదర్శిగా మౌటం రంజిత్, ఉపాధ్యక్షులుగా మౌటం వీరన్న, కాల్వ కుమార్, కొయ్యడ సునీల్, కోశాధికారిగా మంద చరణ్, సహాయ కార్యదర్శులుగా మౌటం తిరుపతి, చిలుక రాజేందర్, గొట్టె మహేందర్, ప్రచార కార్యదర్శులుగా కొలుగూరి కిషోర్, జన్ను వెంకటేష్, కాల్వ రాహుల్, జక్కు బిక్షపతి, గౌరవ అధ్యక్షులుగా చల్లూరి రమేష్, గౌరవ సలహాదారులుగా మౌటం రమేష్ ( మాజీ ఉప సర్పంచ్ ) మండల అశోక్, కార్యవర్గ సభ్యులుగా కుక్కల శ్రీను, కొదారి అరుణ, చిట్యోజు పవన్, మొగిలిచర్ల అఖిలేష్, కొండ కిట్టు, వెంగళ సహదేవ్, కిన్నెర రవీందర్, గొట్టె శ్రీను, శనిగరపు రమేష్, శనిగరపు రాజశేఖర్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# ఉప్పల్ రైల్వే గేట్‌తో ఇంకెన్నాళ్ళు ఈ గోస..??

**ప్రజాపక్షం/కమలాపూర్ :** ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు హుజురాబాద్ పరకాల ఫోర్ లైన్ రహదారి వెంట ప్రయాణించే వాహనదారులకు గత కొద్ది సంవత్సరాలుగా ఉప్పల్ రైల్వే గేట్ తో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉప్పల్ రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జీ నిర్మాణం పనులు కాంట్రాక్టర్ కు అప్పగించగా పూర్తి కాకపోవడంతో ప్రయాణికులకు తలనొప్పిగా మారింది. గతంలోను, ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో బ్రిడ్జీ నిర్మాణాలు ప్రారంభించింది. ఏండ్లు గడుస్తున్నప్పటికి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా బ్రిడ్జీ నిర్మాణం తయారైంది. గత పది సంవత్సరాలుగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులుగా బండి సంజయ్ కుమార్ ఉన్నతమైన పదవులు పొంది ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. సంవత్సరాలు గడిచినప్పటికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, హుజురాబాద్ నియోజకవర్గం మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, హుజురా బాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఉప్పల్ రైల్వే గేట్ వద్దకు వచ్చి బ్రిడ్జీ నిర్మాణ పనులను పరిశీలించి కేంద్ర రైల్వే శాఖ మంత్రి, అధికారికి విన్నవించినట్లు పలు పత్రిక ముఖంగా తెలిపారు. ఈ సందర్భాలలో పేపర్ ప్రకటనలకే తప్ప ఎలాంటి బ్రిడ్జీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జీ నిర్మాణం వద్ద గేట్ పడితే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.



అత్యవసర పనులు నిమిత్తం వెళ్ళే ప్ర యాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా హుజురాబాద్ నుంచి భూపాల్ పల్లికి ఆర్టీసి బస్సు ద్వారా ప్రయాణించే ప్రయాణికుల పాట్లు అంతాఇంతా అని చెప్పానక్కర లేదు. ఉదాహరణకు ఈనెల 8న సికింద్రాబాద్ నుంచి బల్లార్షా వెళ్ళవలసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉప్పల్ స్టేషన్ వద్ద సిగ్నల్ పాయింట్ సరిగా పనిచేయకపోవడంతో 20 నుంచి 30 నిమిషాలు నిలిచిపోవడంతో అటు రైలు ప్రయాణికులకు, ఇటు పరకాల నుంచి హుజురాబాద్ కి వెళ్ళవలసిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోతే గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉప్పల్ రైల్ గేటు వద్ద ఏ విధంగానైతే రైల్ రోకో చేశారో అదే విధంగా రైల్ రోకో చేపట్టకపోతే ప్రభుత్వం, పాలకులు వినే పరిస్థితి లేదని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి, ఎంపి ఈటల రాజేందర్ రెడ్డి నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## రైతులకు అండగా వొడితల ప్రణవ్

### డిబిఎం 21 మరమ్మత్తుల కోసం రూ. 20 వేల విరాళం



**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ ఎస్ఆర్ఎస్పి కెనాల్ కాలువ ద్వారా వ్యవసాయం సాగిస్తున్న రైతన్నలు ఆదుకునేందుకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వొడితల ప్రణవ్ బాబు ముందుకు వచ్చారు. ఎస్ఆర్ఎస్పి కెనాల్ కాల్వ మరమ్మత్తు కోసం రైతులకు 20 వేల రూపాయలను అనుచరులతో పంపించారు. నగదు మొత్తాన్ని రైతులకు నేడు అందించడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. రైతులకు ప్రణవ్ అండగా ఉంటున్నారని వారికి రుణపడి ఉంటామని రైతులు పేర్కొన్నారు. మరమ్మత్తులు సహాయంతో నీరు సమృద్ధిగా చేరి తమ పంటలు పండుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చరణ్ పటేల్, డాక్టర్ మౌటం కుమారస్వామి, మాజీ సర్పంచ్ కెత్తె రవి, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్ కెత్తె విజేందర్, తాటిపాముల రాములు, రమణారెడ్డి, బోయిని విజయ్, మామిడాల సమ్మయ్య, బోయిని శివ తదితరులు పాల్గొన్నారు.

## రామప్పలో జవహర్ నవోదయ విద్యార్థుల సందడి



ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండలంలోని పాలంపేట లో గల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా మామునూరు లో గల జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులతో ఆదివారం సందడిగా మారింది. 6 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పీఎం (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) టూర్ లో భాగంగా రామప్ప, లక్నవరం సందర్శించినట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు ,ఆశీర్వచనాలు వారికి అందజేశారు. అనంతరం టూరిజం గైడ్ విజయ్ ఆలయ చరిత్రను వారికి వివరించారు. వారి వెంట ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల అధ్యయనంపై ఇంటింటికీ..

### జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రజా సమస్యల అధ్యయనంపై మహబూబాబాద్ పట్టణం టూ టౌన్‌ఏరియాకమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఎం కార్యక్రమం సిపిఎం టూ టౌన్ కార్యదర్శి అల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య పార్టీ జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణంలోని 36వ వార్డులో సమమస్యలు అధ్యయనం కొసం ఈనెల 05వ తేదీ వరకూ సిపిఎం బృందాలు వస్తాయని పట్టణ ప్రజలు సిపిఐ ప్రతినిధి బృంధాలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పట్టణంలో సరైన రోడ్లు, డ్రైనేజీ, విద్యాత్ దీపాలు, కొన్ని బజారుల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు లేక, పాత మురికి కాలువ కూలిపోయి డ్రైనేజి నీరు బయటికి పోక పురాతన ఇండ్లలో చెట్లు మొలిచి వాటిలో కోతులు ఉండి ప్రజలను చాలా ఇబ్బందులు పెడుతున్నాయన్నారు.పెన్షన్‌లు రాక వితంతువులు, వికలాంగులు, వృద్దులు,ఇబ్బందులు పడుతున్నారని, ఆయన, ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో 2014 నుండి ఇండ్లు కట్టుకుని నివసిస్తున్న ఇండ్లకు ఇంటి నంబర్లు లేవని ప్రజలకు మీటర్లు లేక కరెంట్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే ఇంటి నెంబర్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమవుతున్నాయని వారన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 6గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మహబూబాబాద్ పట్టణంలోని వార్డుల్లో సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాంనాయక్,పట్టణ కమిటి సభ్యులు నక్క సైదులు,ఏరియా కమిటీ సభ్యులు మందుల మహేందర్, ఇల్లటూరి లాలయ్య, శాఖ కార్యదర్శులు ఎండి రఫీద్, మాచర్ల భాస్కర్ ఈదునూరి రేణుక, భూక్యా రాజేష్ 25వ వార్డు సభ్యులు గాడిపెల్లి వెంకన్న, గుండు సురేష్, రమేష్, అంజి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ పరికిపండ్లకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** గత రెండేళ్లుగా ప్రతీ ఎక్స్‌ప్రెస్ రైల్లో సాధారణ బోగీలు ఐదుకు పెంచాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ప్రధానమంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని మొదలుపెట్టి ప్రత్యక్షంగా 8 రాష్ట్రాలు తిరిగి ప్రజలను చైతన్యవంతులు చేసి దేశవ్యాప్తంగా 40 లక్షల ఉత్తరాలను చేరవేయడంతో జనరల్ బోగీలను పెంచుతున్నట్లు రైల్వే శాఖ సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం ద్వారా ఈనెల 4న లెటర్ నంబర్ 677 ధృవపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా భారతి చాటల్ ఫుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్‌తోటలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన విశేష కృషి చేసిన డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ విద్యాసాగర్, పద్మ, బ్రాహ్మణ సంఘం నాయకులు కృష్ణశాస్త్రి, మోహన్, కుమార్, సతీష్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నకు జేరిపోతుల పరుశరామ్ వినతిపత్రం

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రధాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీనోట్లపై ముద్రించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అద్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశరామ్ తన క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం పరుశరామ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఫోటో కరెన్సీనోట్లపై ముద్రించాలని అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడాలని మల్లన్నను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట నాయకులు రవి, మధు, అజయ్, తదితరులున్నారు.

## కాంగ్రెస్ యూత్ ఉపాధ్యక్షులుగా మంగ రాజు



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలం కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ గా మంగరాజు ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మంగరాజును సన్మానించడం జరిగినది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బద్ధుడై ఉంటూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు అన్ని విధాల పని చేయాలని, ఒక మంచి నాయకునిగా పేరు తెచ్చుకోవాలని రాజుకు సూచించారు. ఈ సందర్భంగా మంగ రాజు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన కాంగ్రెస్ పెద్దలకు, ఎమ్మెల్యే రేవూరికి సహకరించిన కార్యకర్తలకు ధన్యవాదములు తెలుపుకుంటున్నానని చెప్పారు. తాను కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి నియమ నిబంధనలకు అనుకూలంగా పనిచేస్తూ ప్రజాసేవలో, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

## బాల వికాస సేవలు అభినందనీయం



### ఎమ్మెల్యే సతీమని జాటోతు ప్రమిల

**ప్రజాపక్షం/దంతాలపల్లి :** ప్రజల సమిష్టి కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుంని డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సతీమని జాటోత్ ప్రమిల అన్నారు. మండలంలోని శ్రీవేంకటేశ్వర పంక్షన్ హాల్‌లో బాల వికాస సేవా సంస్థ మండల మహసభను అదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధిగా అమె హజరై మాట్లడుతు మహిళలను చైతన్యవంతులను చేయడంలో బాల వికాస ముందుంటుందని,మహిళల అర్ధికాభివృద్దికి సంస్థ నిర్వహకులు కృషిచేయడం అభినందనీయమని అన్నారు.సంస్థలు స్ధాపించడం కన్నా వాటిని నిర్వహించాడం ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో బాల వికాస సంస్థ పోగ్రామ్ మెనేజర్ లత ప్రతప రెడ్డి,జోతి, అముల్యా,మండల కోఅర్డినేటర్ కందుకురి సుకన్య,శోభరాణి,తదితరులు పాల్గోన్నారు.

## ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలబడుతుంది

### ప్రజానాట్యమండలి

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ జిల్లాలో సీపీఎం నిర్వహించే ప్రజా పోరాటాలకు, ఉద్యమాలకు ప్రజానాట్యమండలి బాసటగా ఉంటుందని పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు యాదగిరి అన్నారు.



పట్టణంలోని బాలాజి నగర్‌లో 2వరోజు జరిగిన ప్రజానాట్యమండలి శిక్షణ తరగతులలో పాల్గొని ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేయాలని, సాగు,తాగునీరు అందించాలని, ఇళ్ల స్థళాలు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు అందించాలని, ఇలా తదితర సమస్యల పరిష్కారానికి జరుగుతున్న ఉద్యమాలకు, పోరాటాలకు ప్రజలను సన్నద్ధం చేయడానికి ప్రజానాట్యమండలి బాసటగా నిలుస్తుందని, దోపిడీపై తిరుగుబాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజ ఎల్లయ్య, బోనాద్రి వెంకటాద్రి, కంత్రి ఐలయ్య, తూటి దేవదానం, దాసగాని ఉమ, కాసర్ల యాదవరెడ్డి, గ్రంథమాల నరసింహస్వామి, నక్క రమేష్, మానపల్లి నిర్మల, చక్రపాణి, ఐలయ్య, గంగరాజు, నరహరి, పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సిఎం కప్ క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండలంలోని వివిధ పాఠశాలలో సీఎం కప్ 2024 పోటీలు రెండవ రోజు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. క్రీడల పట్ల విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభను కనబరుస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న పీఈటీ విద్యార్థుల తో క్రీడలు ఆడిస్తూ విద్యార్థులకు సూచనలు ఇస్తున్నారు.

# సిఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను రేపటి నుంచి 12వ తేది వరకు మూడు రోజుల పాటు మండలంలోని గోమారం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ నాగేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆసక్తి గల క్రీడాకారులు తమతమ పంచాయతీ కార్యదర్శిల వద్ద పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ కోరారు.

# ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/గజ్వేల్:** మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన ఆందోలు ఆలేఖ్య వివాహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆర్థిక సహాయం అందించారు. అలేఖ్య చిన్న వయసులోనే తల్లి దండ్రులు అనారోగ్యంతో మృతి చెందగా, వారిది నిరుపేద కుటుంబం కావడంతో వివాహం ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కష్ట సమయంలో మాకు సహాయం చేసిన సందర్భంగా యువతి సంరక్షకులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మద్ది రాజిరెడ్డి, చాడా శ్రీనివాస్ రెడ్డి, రమేష్ గౌడ్, అహ్మద్ , నిజామోద్దీన్, రామ గౌడ్, బుచ్చిరెడ్డి, రాములు గౌడ్, అయ్యాలం, బాలయ్య, రాజు, రమేష్, కిష్టారెడ్డి, గోపాల్ రెడ్డి, నాంపల్లి పాల్గొన్నారు.

# ఆరోగ్య బీమాతో ఆర్థిక ధీమా




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రతి వ్యక్తికి ఆరోగ్య భీమాతో ఆర్థిక ధీమా ఉంటుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం అట్లా సురేష్ అన్నారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన బోనగంటి కిరణ్ అనే వ్యక్తి గత మూడు సంవత్సరాల క్రితం 30,000/ రూపాయలతో అష్యూర్డ్ ఇన్కమ్ ప్లాన్ ను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో మూడు కిస్తులు కట్టడం జరిగింది. ఇటీవల పాలసీదారుడు మరణించగా అతని భార్య బోనగంటి భవానికి శ్రీ రామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం సురేష్, డిఎం వినయ్‌ల చేతుల మీదుగా:(515910/ ) ఐదు లక్షల పదిహేను వేల తొమ్మిది వందల పది రూపాయలచెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఏజిఎం అట్ల సురేష్ కుమార్, డిఎం వినయ్, భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ సంతోష్, డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్, డిఓస్, ఎస్ఓస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ సర్కార్‌ను అప్రతిష్టపాలు చేయటం మానుకోవాలి

* పదేండ్ల బిఆర్ఎస్ కంటే కాగ్రెస్ ఏడాది పాలన మెరుగు
* ప్రతిపక్షాలు కాంగ్రెస్‌ను విమర్శించటం మానుకోవాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయటం మానుకోవాలని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన రాలేదన్నారు. దీంతో ప్రజలు బిఆర్ఎస్‌పై విరక్తి చెంది కాంగ్రెస్ పార్టీకి పట్టణ కట్టారన్నారు. బిఆర్ఎస్ పదేండ్లలో చేయలేని పనులు సిఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ సర్కార్ సంవత్సర కాలంలోనే చేసి చూపించినట్లు తెలిపారు. సిద్దిపేట అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సిద్దిపేట అభివృద్ధి పనులను మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఇంచార్జి మంత్రి కొండ సురేఖలు త్వరలో ప్రారంభిస్తారన్నారు. మాజీ మంత్రి కెసిఆర్ కుమార్తె ఎంఎల్సి కవిత పోలిక ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని బిఆర్ఎస్ ఆవిష్కరిస్తే అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరిస్తుంటే విమర్శలు చేయటం సరికాదన్నారు. ఇప్పటికైన బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహంపై రాద్ధాంతం చేయటం మానుకోవాలన్నారు. కాంగ్రెస్ సంవత్సర పాలనపై బిఆర్ఎస్ నాయకులు సిద్ధమా అని సవాల్ అత్తుఇమామ్ సవాల్ విసిరారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో వేగంగా ముందుకు వెళ్తుందన్నారు. అధికారం కోల్పోవటంతో బిఆర్ఎస్ నాయకుల మతిభ్రమించిందన్నారు. ప్రతి చిన్న విషయాన్ని పెద్దగా రాద్ధాంతం చేస్తూ రాష్ట్రంలో లా అండ్ అర్డర్ దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి హోదాలో పనిచేసిన హరీష్‌రావు ఏడాది పాలనపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం బాధకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హుందాగా వ్యవహరించాలని కోరారు. ప్రజలు కట్టబెట్టిన అధికారంతో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతుందన్నారు. ప్రతి పక్ష హదాలో ఉన్న బిఆర్ఎస్ నేతలు బాధ్యతగా వ్యవహరించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇప్పటికైన కాంగ్రెస్‌పై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈసమావేశంలో కాంగ్రెస్ నాయకులు పట్టణ ప్రధానకార్యదర్శి గ్యాదరిమధు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాసొద్దీన్, కిషన్, బాబ, సజ్జు , ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలు ఐక్యంగా కదిలితే రాజ్యాధికారం మనదే

## అట్టడగువర్గాల సామాజిక న్యాయం కోసం కృషి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** రాష్ట్రంలో ఇంటికోకరు కలసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడగువర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని బిసి రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజ్యాధికార సమితి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్ ముదిగొండ శ్రీనివాస్ నాయకత్వంలో సిద్దిపేట మర్కేండేయ దేవాలయభవన్‌లో నిర్వహించిన జిల్లా వ్యాప్త ముఖ్యనేతల రౌండ్ టెబుల్ సమావేశానికి దాస్ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అట్టడగు వర్గాలు బిసిల రాజ్యాధికారం కోసం పోరాడకపోవటం వల్లనే అగ్రవర్ణాల అజమాయిషి కొనసాగుతుందన్నారు. అధికారంకోసం బిసిలు తిరగబడితే అనివార్యంగా అగ్ర వర్ణాలు వారి కుర్చిలు ఖాళీ చేసే రోజు ఏంతోదూరంలో లేదన్నారు.అగ్రవర్ణాల ప్రజలు తమ వాటాను తాము అనుభవిస్తూనే బిసి,ఎస్సీ ఎస్టీల వాటాను కూడ అనుభవిస్తామనటం ఏమేరకు సమంజసమన్నారు.ఇకపై అగ్ర వర్ణాలు వాట అగ్రవర్ణాలు, అట్టడగు వర్గాల వాట అట్టడగు వర్గాలు అనుభవించేలా సామాజిక న్యాయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ ప్రజలకు ఉపకరించే విధంగా తమిళనాడు తరహాలో రాష్ట్రంలో ఈడబ్లుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 8లక్షల పై బడి సంపాదన ఉన్న బిసి వర్గాలను క్రిమిలేయర్‌గా అభివర్ణిస్తూ వారిని రిజర్వేషన్లు దూరం చేస్తూ 8లక్షల సంపాధన ఉన్న అగ్రవర్ణ విద్యార్థులు మాత్రం కేంద్రం పేదవారిగా పరిగనించటం ఏ మేరకు సమంజసమన్నారు. ఈకార్యక్రమంలో బిసి నంక్షేమసమితి నాయకులు ప్రోఫెసర్ కృష్ణ దయాసాగర్, నాగేశ్వర్ రావు, గూడురి శ్రీనివాస్, రాములు, గుండురవితేజ, శ్రీనివాస్, శంకర్, రాజయ్య, మార్క శ్రీనివాస్, కనకయ్య, శ్రీశైలం, ప్రశాంత్, బాబురావు, ఏలే బాలకృష్ణ హైమవతి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

# సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** మహిళల అభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కల చిత్రపటానికి ములుగు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రేగా కళ్యాణి ఆధ్వర్యంలో మహిళ కాంగ్రెస్ నాయకురాలు ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో మహాత్మాగాంధీ విగ్రహ సెంటర్‌లో పూల మాల వేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట ప్రభుత్వం మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత ఇస్తుందో ప్రభుత్వం అమలు చేసే పథకాలు నిదర్శమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్, ఇంకా గృహజ్యోతి పథకం క్రింద రూ.200 యూనిట్ల విద్యుత్ ఉచిత విద్యుత్తు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, సన్నవడ్లకు రూ.500 బోనస్ లాంటి పథకాలు అమలు చేస్తుందని మం త్రి వర్గంలో మహిళలకు కూడా అవకాశాన్ని కల్పించి మహిళాశక్తి ముందుకు వెళ్తే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ చిక్కుల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ రక్షణ కోసం కరాటే దోహదం

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కరాటే ఆత్మ రక్షణకే కాకుండా టైక్వాండో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల కోసం దోహదపడుతుందని భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టైక్వాండో బెల్ట్ గ్రీటింగ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. జిల్లా టైక్వాండో అసోసియేషన్ సెక్రెటరీ కొల్లోజు దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్, జయశంకర్ భూపాలపల్లి డిస్ట్రిక్ట్ టైక్వాండో అసోసియేషన్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఆత్మరక్షణకే కాకుండా స్పోర్ట్స్ పరంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ టైక్వాండో క్రీడ ద్వారా 2 రిజర్వేషన్ స్పోర్ట్స్ కోట ద్వారా ఉంటుందని చెప్పారు. ఈ రిజర్వేషన్ విద్యార్థులకు యువతకు పై చదువులకు అలాగే ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపల్ మూర్తి, అలాగే వరంగల్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ సెక్రెటరీ తిరుపతి, జయశంకర్ జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహేందర్ యాదవ్, అలాగే విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నాపాక ఆలయ విస్తీర్ణం హద్దులు ఏర్పాటు చేసిన దేవాదాయ శాఖ



**ప్రజాపక్షం/చిట్యాల:** మండలంలోని నాపాక సర్వతో భద్ర ఏక శిలా ఆలయ విస్తీర్ణం అన్యాయ క్రాంతం అవుతుందని దేవాదాయ కమిటీ ఫిర్యాదు మేరకు స్పందించిన దేవాదాయ శాఖ ఉప కమిషనర్ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం దేవాదాయ శాఖ పరకాల డివిజన్ పరిశీలకులు నందన కవిత, దేవాదాయ శాఖ సర్వేయర్ పసునూరి అనిల్ దేవాలయ భూమిని దేవాలయ ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకర చార్యులు, కమిటీ గ్రామస్తులతో కలిసి సందర్శించి పరిశీలించి సర్వే చేసి భూములకు హద్దులు వేయించి హద్దురాళ్లకు కలర్ పెయింట్ వేశామని తెలిపారు. దేవాదాయ శాఖ అధికారి నందనం కవిత మాట్లాడుతూ, నైన్పాకలో గల నా పాక పురాతన ఆలయం భూమిని అన్యాయక్రాంతం అయిందన్న ఫిర్యాదు మేరకు స్థలం పరిశీలించి సర్వేనెంబర్ 401 లో విస్తీర్ణం 2ఎకరాల 18 గుంటల భూమి సర్వే చేసి హద్దురాళ్ళు వేశామని, వేసిన హద్దులను ఎవరైనా తొలగించినట్లయితే ఎండోమెంట్ యాక్ట్ ప్రకారంగా పీడియాక్ట్ కేసులు నమోదు చేస్తామని, చేసిన కేసులకు కోర్టులో బెయిల్ కూడా దొరకకుండా ఉంటుందని హెచ్చరికలు జారీ చేయడం జరిగిందన్నారు. ఆలయానికి సంబంధించిన చుట్టుపక్కలో ఉన్న మిగతా భూమిని కూడా త్వరలో సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. దేవాలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య, డైరెక్టర్లు ఎర్రయ్య, రాజయ్య, ఐలయ్య, కమల, గ్రామస్తులు బావు గట్టయ్య, నక్క భాస్కర్, మారెళ్ళ దేవేందర్, తొట్ల ఐలయ్య, కావటి కొమురయ్య, మరెళ్ళ రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుల్స్ మృతి

## సంతాపం వ్యక్తం చేసిన మాజీ మంత్రిహరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేటకు చెందిన ఇద్దరు కానిస్టేబుల్స్ పరందాములు, వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎంఎల్ఏ హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగంలో నిబద్దత కలిగిన యువ కానిస్టేబుల్స్ మృతిచెందటం బాధకారమని ఆవేదన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగుల కాకుండ సామాజిక సేవకులులుగా వీరు యువకులకు ఏంతో స్పూర్తినిచ్చారన్నారు. సిద్దిపేటలో జరిగిన మారథాన్ యువకుల్లో ఏంతో చైతన్యం తెచ్చిందన్నారు. ఉచిత కానిస్టేబుల్ కోచింగ్, ఇతర సామాజిక సేవల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. ఇంకా సమాజంలో ఏన్నో చేయాల్సిన వీరికి ఇలా జరగటం చిన్న వయస్సులో తీరని లోకానికి వెళ్లటం బాధకరమన్నారు.వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

# రామప్ప సరసన కోటగుళ్ళకు ప్రత్యేక స్థానం

- సాస్కి స్కీమ్‌తో కోటగుళ్ళు, గణపసముద్రం సరస్సు అభివృద్ధి
- రామప్ప, ఇంచర్ల అభివృద్ధికి రూ.73,74 కోట్ల నిధుల కేటాయింపు
- నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల
- అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం
- టూరిజం హబ్ ఏర్పాటుకు కసరత్తు





**ప్రజాపక్షం/గణపురం :** 800 ఏళ్లకు పైగా చరిత కలిగిన కాకతీయుల కళా వైభవానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. కాకతీయుల వారసత్వ సంపదైన కోటగుళ్లకు కొత్త రూపు సంతరించుకొనుంది. కాకతీయులు నిర్మించిన రామప్ప ఖ్యాతి ఖండాంతరాలు దాటి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించగా ఇప్పుడు రామప్ప సరసన కోటగుళ్ళ కు ప్రత్యేక స్థానం దక్కింది. రామప్ప దేవాలయ అభివృద్ధి తో పాటు శిథిలమవుతున్న కోటగుళ్ల అభివృద్ధి కి సాస్కి స్కీమ్ ద్వారా చరిత్రలో మొదటిసారి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. యూనిస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకతీయుల కళా క్షేత్రం గణపేశ్వరాలయం కోటగుళ్ళకు త్వరలో మహార్దశ పట్టనుంది. రామప్ప కోటగుళ్లతోపాటు గణప సముద్రం, సరస్సు, రామప్ప సమీపంలో ఉన్న ఇంచర్ల గ్రామాన్ని కూడా సాస్కి పథకం లో చేర్చి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. కాకతీయుల కట్టడాలకు రోజురోజుకు పర్యాటకులసంఖ్య పెరుగుతోంది. ఆలయాలభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్యాతిక వారసత్వ వృద్ధి పథకం (ప్రసాద్) 2022లో చేర్చింది. సాస్కీ స్కీం ద్వారా మరింత అభివృద్ధి చేయనున్నారు.

### రామప్ప సరసన కోటగుళ్ళకు స్థానం

రామప్ప, కోటగుళ్ల రెండు ఆలయాలను కాకతీయులు నిర్మించినప్పటికీ రామప్ప కు మాత్రం ప్రపంచ పఠంలో స్థానం దక్కింది. శిథిలావస్థకు చేరిన కోటగుళ్ళు నిరాధార ణకు గురికాగా 18 సంవత్సరాల క్రితం కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసి దాతల సహకారంతో ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు. ఆలయ ప్రాంగణంలో గోశాలను నిర్మించారు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి వేడుకలు ఇక్కడ ఘనంగా జరుగుతాయి. కళ్యాణాన్ని సందర్శించేందుకు పర్యటకులు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. రామప్పదేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రామప్ప కు కేవలం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటగుళ్ల అభివృద్ధికి నడుం బిగించింది. కోట గుళ్ళు గణప సముద్రం సరస్సు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం ఇదే మొదటిసారి, గతంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం రెండు కోట్లు కేటాయించి కొంత పనులు మాత్రమే పూర్తి చేసింది.

### కోటగుళ్లకు టూరిజం హబ్‌లో స్థానం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించక మరుగునపడి శిథిలావస్థకు చేరుకున్న కోటగుళ్ళు ఆలయం నేడు కేంద్ర ప్రభుత్వం సాస్కి పథకంలో రామప్పతో పాటు విధాల అభివృద్ధి చేసేందుకు రూ.73,74 కోట్లు కేటా యించింది. దీంతో కేంద్ర పర్యాటక శాఖ నూతనంగా తయారు చేసే టూరిజం హబ్ లో కోట గుళ్ళ కు స్థానం దక్కింది.

**కోటగుళ్ల లో సాస్కి స్కీమ్‌లో చేయనున్న పనులు ఇవే :** స్కల్ప్చర్ గార్డెన్, కొత్త రకమైన పరికరాలతో పిల్లల ఆట స్థలం, పార్కింగ్ ప్రాంతం, సీలింగ్ మండపం, సీటింగ్ బెంచీలు, తాగునీరు, డస్ట్ బిన్‌లు, సంకేతాలు, ఆన్‌సైట్ ల్యాండ్‌స్కేపింగ్. ఆన్‌సైట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్. తదితర పనులు చేయనున్నారు. గణపసముద్రం సరస్సులో సెక్యూరిటీ, ఎంట్రన్స్ గేట్, పార్కింగ్ ప్రాంతం. అడ్మిన్, రెస్టారెంట్, వాష్‌రూమ్‌లు, లేక్ వ్యూ వాక్ వే, పిల్లల ఆట స్థలం, లేక్ వ్యూ కాటేజీలు, 6ఎమ్ వెడల్పు గల సిసి రోడ్, నిర్మాణం మెడ్ ల్యాండ్‌స్కేపింగ్‌తో పాదచారుల మార్గం, లేక్ వ్యూ, పాయింట్, ఫ్లోటింగ్ జెట్టీ ,బోటింగ్ పాయింట్. ఏర్పాటు చేయనున్నారు.

## దొనగుట్టపై నవీన చారిత్రక ఆధారాలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ పట్టణంలో శాయంపేట దొనగుట్ట (త్రి వేదాద్రి)పై తొలిసారిగా నవీన శిలాయుగానికి చెందిన చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. తెలంగాణాకు చెందని చరిత్ర పరిశోధకుడు, డిస్కవరీ మ్యాన్‌రెడ్డి రత్నాకర్‌రెడ్డి పాతూరి రఘురామయ్యతో కలిసి శాయంపేట గుట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా దొన గుట్టపై జరిగిన పరిశోధనా వివరాలను తెలియజేస్తూ హనుమకొండ పట్టణంలోని శాయంపేట గుట్టలపైన శ్రీ సంతోష లక్ష్మి నరసింహస్వామి దేవాలయం వెనుక వైపున సమతల ప్రాంతంలో నవీన శిలా యుగపు బగ్స్((గ్రూవ్స్)ఉన్నాయని, వీటిని బట్టి సుమారుగా ఐదువేల ఏళ్ల కిందటే మానవులు ఇక్కడ రాతి పనిముట్లను తయారు చేసుకునే వారిని, వ్యవసాయం సాగు చేసేవారని తెలుస్తున్నదని తెలిపారు. ఆలయం వెనుక భాగంలో స్వయం భూ శివ లింగం,తొలిచిన వామన గుంటలు, చాళుక్యుల నాటి వినాయక విగ్రహం ఉన్నాయని, ఆలయ సంరక్షకులు చారిత్రిక ఆధారాలను తెలిపే వివరాలను భక్తులకు, పర్యాటకులకు అందుబాటులో ఉం చితే ఆలయ చారిత్రక విలువ రెండింతలు పెంచిన ట్లు అవుతుందని పరిశోధకుడు తెలిపారు.

## భగవద్గీతలో ప్రతి సమస్యకు పరిష్కారం



### కృష్ణమాచార్య సిద్ధాంతి

ప్రజాపక్షం/జనగామ టౌన్: సమస్త మానవాళి జీవన విధానంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు పరిష్కారం భగవద్గీత చూపిస్తుందని బాణాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆస్థాన సిద్ధాంతి సంపత్కుమార కృష్ణమాచార్య అన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆద్వర్యంలో గీతా జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక బాణాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రాంరెడ్డి, కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్ధాంతి కృష్ణమాచార్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా గీతా శ్లోకాల పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గునిగంటి రామకృష్ణ, బిక్కి అలివేణి మంగ, లావణ్య కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కోడూరు మాజీ సర్పంచ్ మృతి

### కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాళి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ దుబ్బాక చంద్రయ్య గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందడం జరిగింది. మాజీ సర్పంచ్ మరణవార్త తెలుసుకున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుతో కలిసి ఆదివారం కోడూరులో గల ఆయన స్వగృహానికి సందర్శించి చంద్రయ్య పార్థీవదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, జిల్లా నాయకులు మాసంపల్లి లింగాజి, మేకల నరేందర్, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరక్టర్ తోటకూరి రమేష్, నాయకులు సురేష్, లోనె శ్రవణ్, తదితరులున్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఆ సంఘం ఆద్వర్యంలో కేక్‌కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివరాత్రి వెంకటేష్, బొంకూరి ఉప్పలయ్య, సోమేశ్వర్, బీరెల్లి నర్సయ్య, చెన్నూరు యాకయ్య, గాదరి శోభ, శివరాత్రి స్వర్ణ, చిట్యాల సంధ్యారాణి, ఎంఆర్‌పీఎస్ నాయకుడు సీహెచ్ యాదగిరి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లబెల్లి :** నర్సంపేట నియోజక వర్గ అభివృద్ధిపై కాం గ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజురైన అభివృద్ధి నిధులను రద్దు చేసిందని మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు . ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట గ్రామ పరిధిలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం మంజురి చేసిన ఉధ్యావన పరిశోధన కేంద్రం ఏడాది పూర్తి కావడంతో నిరసిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో మం డల పార్టీ అధ్యక్షుడు బానోతు సారం గపాణితో కలిసి మాట్లాడారు. మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఏమి సాధించిందని విజయోత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. మంజురైన ఉద్యానవన పరిశోధన కేంద్రంపై స్థానిక ఎంఎల్‌ఎ దొంతి మాధవరెడ్డి ఏనాడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అధికారులతో సంప్రదింపులు జరుపలేదని విమర్శించారు. పరిశోధన కేం ద్రంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్ళేందుకు బహిరంగా లేఖ రాసిన ఫలితం లేదని, కనీసం యూనివర్సిటి విసితో సమీక్ష జరిపిన దాఖలాలు లేవన్నారు. నిధులు మంజురు చేస్తే ఉన్న నిధులను ఖర్చు చేయకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. మా జీ ఎంపిపి కక్కెర్ల శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి బానోతు హరినాథ్‌సింగ్ ,బిఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులు ఊడుగుల ప్రవీణ్ ,కొత్తపెల్లి కోటిలింగాచారి, గందె శ్రీనివాస్ మాజీ సర్పంచులు తంగేళ్ళ నిర్మళరవింధర్‌రెడ్డి, నానబోయిన రాజారాం, లూనవత్ వెంకన్న, మామిండ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## బాధిత కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని లక్ష్మి నారాయణపురం గ్రామానికి చెందిన వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులున్నారు.